క్లుప్తంగా

నేడు నైపుణ్య గణనపై శిక్షణ

తవణంపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు స్కిల్ డెవలప్‌మెంట్–2024పై ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తవణంపల్లె ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో అరగొండ, చెర్లోపల్లె, దిగువమాఘం, ఎగువ తవణంపల్లె, గోవిందరెడ్డిపల్లె, జొన్న గురకల, మల్లకుంట, మత్యం, నలిశెట్టిపల్లె సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. వెలుగు కార్యాలయంలో పైమాఘం, పల్లెచెరువు, పట్నం, పుణ్యసముద్రం, సరకల్లు, టి.పుత్తూరు, తవణంపల్లె, వెంగంపల్లె పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహిస్తామని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శిక్షణా తరగతులకు తప్పక హాజరు కావాలని కోరారు.

కార్డన్ సెర్చ్‌లో 32 బైకులు స్వాధీనం


బైక్‌లను పరిశీలిస్తున్న సీఐ నెట్టికంటయ్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య, ఎస్ఐ ప్రసాద్ తమ సిబ్బందితో కలిసి నగరంలోని ఓబనపల్లె కాలనీలో ఆదివారం తెల్లవారు జామున ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. కాలనీలో ఆకస్మికంగా తనిఖీ చేసి, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడమే ఉద్దేశమని సీఐ తెలిపారు. సరైన పత్రాలు లేని 32 బైకులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

సారా స్థావరాలపై దాడులు


తనిఖీ చేస్తున్న ఎస్ఐ రామ్మోహన్

గుడిపాల: పోలీసులు ఆదివారం రాసనపల్లిలో ఉన్న నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. గ్రామం చుట్టూ నాటు సారా తయారీ స్థావరాలు, ఊట నిల్వలను గుర్తించారు. సుమారు వెయ్యి లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. ఎస్ఐ రామ్మోహన్ మాట్లాడుతూ నాటు సారా తయారు చేయడం, విక్రయించడం చట్ట విరుద్ధమన్నారు. నిబంధనలకు అతిక్రమించి సారా తయారు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి


రాజా (ఫైల్)

బంగారుపాళెం: ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి 11 గంటలకు స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఆది ఆంధ్రవాడకు చెందిన రాజా(55) రోడ్డు దాటుతుండగా బంగారుపాళెం నుంచి మొగిలి వెంకటగిరికి వెళ్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజా తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారె సమర్పణ


సారెను తీసుకెళ్తున్న వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్తలు, భక్తులు

గంగవరం: పట్టణంలోని పాతపేటలో కొలువుదీరిన వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్తలు కనకదుర్గమ్మకు సారె సమర్పించారు. ఆలయంలో వేణుగోపాలస్వామికి ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ధర్మకర్తల ఆధ్వర్యంలో అక్కడి నుంచి కనకదుర్గమ్మ ఆలయం వరకు మేళతాళాలతో భక్తులు ఊరేగింపుగా సారెను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత సారెను అమ్మవారికి అలంకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ స్థాపన

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 43 అడుగుల ఎత్తు గల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ అర్చకులు, భక్తులు కలసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కంచి పరమాచార్యులు అందించిన ధ్వజచక్రానికి పూజలు చేసి క్రేన్‌తో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. స్వామివారికి హోమాలు, పూజలు, మహామంగళహారతి నిర్వహించారు.

పింఛన్ కోత

- పింఛన్ల పంపిణీ రెండు రోజులేనా?
- తీసుకోని పక్షంలో నగదు వెనక్కి
- అయోమయంలో పింఛన్‌దారులు
- సచివాలయ ఉద్యోగులు సైతం తికమక


గంగాధరనెల్లూరులో పింఛన్ల కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు (ఫైల్)

కూటమి ప్రభుత్వం రాకతో పండుటాకులకు గండం మొదలైంది. పింఛన్లపై కూటమి కత్తి వేలాడుతోంది. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే పింఛన్ల రద్దుకు కూటమి సర్కార్ స్కెచ్ వేసింది. సామాజిక పింఛన్లను గత ప్రభుత్వం కంటే పెంచి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక పింఛన్ల భారం తగ్గించుకునేందుకు కోతలకు తెగబడుతోంది. ఈ క్రమంలో పింఛన్ నగదు చేతికందేవరకు పింఛన్‌దారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొత్తగా పింఛన్ల పంపిణీకి రెండు రోజులు మాత్రమే గడువు అంటూ మెలిక పెట్టడంతో లబ్ధిదారులకు దిక్కుతోచడం లేదు. విషయం అర్థం కాని సచివాలయ ఉద్యోగులు సైతం అయోమయంలో పడుతున్నారు. –కాణిపాకం

పూతలపట్టు నియోజకవర్గంలో 47,559 మంది పింఛన్‌దారులున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.17.81 కోట్ల మేర జమవుతోంది. రెండు రోజుల పింఛన్ల పంపిణీతో 46,621 మంది పింఛన్లు తీసుకున్నారు. మిగిలిన 938 మందిగాను రూ.37,78,000 నగదు ఇవ్వాల్సి ఉంది. అయితే ఈ నగదును సోమవారానికి బ్యాంకులో జమ చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉండడంతో పింఛన్‌దారులు తికమక పడిపోతున్నారు. ప్రధానంగా బంగారుపాళ్యం మండలంలో 717 మందికి గాను రూ.28,68,000 చెల్లించాల్సి ఉంది. అలాగే ఐరాలలో 76 మందికి, తవణంపల్లిలో 54, యాదమరి 49, పూతలపట్టు 45 మందికి పింఛన్ ఇవ్వాల్సి ఉంది.

కూటమి ప్రచార ఆర్భాటం

గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే.. రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని చంద్రబాబు అండ్‌కో ప్రచారం చేసింది. ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం కంటే మిన్నగా పథకాలు అమలు చేస్తామంటూ హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతున్నా సంక్షేమ పథకాల ఊసే పట్టించుకోలేదు. కానీ పింఛన్ పథకంలో కోతకు పదును పెడుతున్నారు. ఒక వైపు కొత్త పింఛన్లకు దరఖాస్తులు తీసుకుంటామని చెబుతూనే, మరో వైపు అనర్హుల పేరుతో కోత పెట్టేందుకు 50 రోజుల ప్రణాళికను సిద్ధం చేస్తూ.. చంద్రబాబు మార్కు పాలనకు తెరలేపారు.

కోతల తీరిది...

అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం కోతలకు సన్నద్ధమైంది. పండుటాకుల నెలవారీ ముద్దను లాక్కోవడానికి కత్తి పెట్టింది. తద్వారా కొంత మంది పింఛన్లు కోతకు గురయ్యాయి. ఆధార్ సక్రమంగా లేదని, సదరం సర్టిఫికెట్‌లో బోగస్ ఉన్నాయంటూ... పింఛన్ల నిలుపుదలకు సిద్ధపడుతోంది. ఇలాంటి తరుణంలో పింఛన్‌దారులకు నెలనెలా పింఛన్ నగదు అందడం ప్రశ్నార్థకంగా మారుతోంది. గుంపులో గోవిందా అంటూ పింఛన్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. సర్వర్ సమస్యలు వేధిస్తున్నాయి. తాజాగా రెండు రోజులు మాత్రమే పింఛన్ల పంపిణీ అంటున్నారు. సచివాలయ సిబ్బంది మిగిలిన నగదును సోమవారం బ్యాంకుకు చెల్లించనున్నారు. దీంతో చాలా మంది పింఛన్‌కు దూరం కానున్నారు.

పండుటాకుల కష్టాలు

పండుటాకులకు ప్రధానంగా అనారోగ్య సమస్యలు వేధిస్తున్నాయి. ఇక ఆలనాపాలన చూసుకునే కొడుకులు, కూతుళ్లు పక్క రాష్ట్రాల్లో ఉంటున్నారు. ఎక్కువగా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనే ఉంటున్నారు. అలా వెళ్లిన వారిలో కొందరు లేవలేని స్థితిలో ఉన్నారు. వీరికి ఇప్పుడు పింఛన్ నగదు చేరడం కష్టతరంగా మారింది. వారి బాధలు పట్టించుకునే వారు లేకపోవడంతో ఇకపై పింఛన్ నగదు కూడా దూరం కానుంది. పింఛన్ల పంపిణీలో గడువు పెట్టి అవ్వాతాతల నోటి దగ్గర కూడును లాక్కుంటే ఎలా అంటూ పలువురు మండిపడుతున్నారు.

గతంలో తలుపు తట్టి...

వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ నగదును పెంచింది. అదే విధంగా వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి పింఛన్‌దారులకు ఇబ్బంది లేకుండా తలుపు తట్టి ఇచ్చేవారు. ఈ ప్రక్రియ వేకువజామున 2 గంటల నుంచే ప్రారంభమై..ఉదయం 9 గంటల్లోపు ప్రతి మండలంలోనూ 80 శాతం పూర్తయ్యేది. సాయంత్రానికి 97 నుంచి 99 శాతం వరకు పంపిణీ జరిగేది. మిగిలిన వాళ్లు 5 రోజుల గడువు సమయంలో తీసుకునేవాళ్లు. ఆస్పత్రి, అనారోగ్య సమస్యలతో బయట రాష్ట్రానికి వెళ్లిన వ్యక్తులకు వలంటీర్లు అక్కడికే వెళ్లి పింఛన్లు ఇచ్చేవారు. ఇలా నెలనెలా పింఛన్ల పంపిణీ అప్పట్లో కొండంత భరోసాను ఇచ్చేది. ఇక కొత్త పింఛన్లు ఆరు నెలలకు ఒకసారి మంజూరు చేసేవారు. ఇప్పుడు అలా లేదని పింఛన్ల పంపిణీ నెలనెలా గండంగా మారుతోందని లబ్ధిదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూతలపట్టు పింఛన్ల వివరాలు

మండలం పేరు	మొత్తం పింఛన్లు	ఈనెల మంజూరైన నగదు రూ.కోట్లల్లో	పింఛన్ తీసుకున్న వారి సంఖ్య	తీసుకోని వారి సంఖ్య	మిగిలిన నగదు రూ.ల్లో
యాదమరి	7633	1.18	7584	49	1,83,500
పూతలపట్టు	8333	3.44	8291	42	1,50,000
బంగారుపాళ్యం	11997	5.07	11280	717	28,68,000
తవణంపల్లి	9688	3.99	9634	54	1,92,500
ఐరాల	9908	4.13	9832	76	3,84,000

నేటి నుంచి ప్రత్యేక పూజలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో సోమవారం కార్తీక పూజలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కట్టమంచిలోని కుళందీశ్వర ఆలయం, ఈశ్వరగుడి వీధిలోని అగస్తీశ్వర స్వామి ఆలయం, ఇరువారంలోని నాగేశ్వర ఆలయం, నీవానది ఒడ్డున ఉన్న రాజుగుడిలో కార్తీక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామిని దర్శించుకునేందుకు పోటెత్తనున్నారు. దీపారాధన చేయనున్నారు. ఇందులో భాగంగా ఆయా ఆలయాల నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


నగదు విరాళం అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని నిత్య అన్నదాన ట్రస్టుకు ఓ దాత రూ.1 లక్ష నగదును విరాళంగా అందజేశారు. నగరికి చెందిన దాత గోపి కుటుంబ సభ్యులతో కలిసి విరాళం నగదును ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం వారికి స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు కోదండపాణి, విగ్నేష్ తదితరులున్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన జరుగుతుందని.. ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయవచ్చని వెల్లడించారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు దూరం


బంగారుపాళెం: మొగిలిఘాట్‌లో ప్రమాదాల నివారణపై సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ

బంగారుపాళెం: వాహనదారులు జాగ్రత్తలు పాటించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరగవని పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణ కోసం సూచికబోర్డులను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొగిలి ఘాట్‌లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణ కోసం చర్యలు చేపట్టామన్నారు. ఘాట్ రోడ్డుకు రెండు కిలోమీటర్ల ముందు నుంచి ప్రమాదాలపై సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి ఘాట్ రోడ్డులో వాహనదారులు 40 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా స్పీడ్ బ్రేకర్లు, స్టాపర్లు చేపట్టామన్నారు. దొరచెరువు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించి వాహనాల రాకపోకల వేగ నియంత్రణ చర్యలు తీసుకున్నామని తెలిపారు. వాహనదారులు నిదానంగా వెళ్లాలంటూ వాయిస్ రికార్డు ద్వారా డ్రైవర్లకు సూచనలు చేస్తున్నట్లు వివరించారు. దీంతోపాటు హైవే మొబైల్ సిబ్బంది తిరుగుతూ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మొగిలి ఘాట్‌లో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో బంగారుపాళెం సీఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ విజేత పెరుమాళ్లపల్లె రాకర్స్


గెలుపొందిన పెరుమాళ్లపల్లె రాకర్స్ జట్టు

యాదమరి(పూతలపట్టు): మండలంలోని పెరుమాళ్లపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ ఫైనల్ పోటీలలో కోడిగుట్ట క్రాకర్స్ జట్టుపై పెరుమాళ్లపల్లె రాకర్స్ టీం ఘనవిజయం సాధించింది. ఇరుపాక్షమ్మ క్రికెట్ మైదానంలో యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రికెట్ టోర్నమెంటులో 20 జట్లు పాల్గొనగా ఆదివారం జరిగిన ఫైనల్ లో పెరుమాళ్లపల్లె రాకర్స్ విజయం సాధించింది. వీరికి మొదటి బహుమతి బహుమతి రూ.5999, రన్నర్స్ కోడిగుట్ట క్రాకర్స్ జట్టుకు రెండో బహుమతి రూ.2999 గ్రామ పెద్ద చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు.

గండకి పద్య కావ్యం ఆవిష్కరణ



పద్యకావ్యాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

గంగవరం: మండలంలోని కళామందిరంలో రామిరెడ్డి మాధవరెడ్డి రచించిన గండకి పద్యకావ్యాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ప్రముఖ శతావధాని ఆముదాల మురళి, ప్రవచనకర్త గుమ్మడి జయరామిరెడ్డి మాట్లాడుతూ సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేసినప్పుడే చిరకాలం నిలుస్తుందన్నారు. గంగానది ఉపనది అయిన గండకి పూర్వ వృత్తాంతాన్ని తీసుకుని ఒక పద్యకావ్యం రాయడం గొప్ప విషయమన్నారు. గండకి అనే వేశ్య విష్ణు భక్తితో నదిగా మారి మహావిష్ణువును తన గర్భంలో సాలగ్రామంగా పొందిన కథను అద్భుతమైన పద కావ్యంగా మలచిన మాధవరెడ్డికి అభినందనీయమన్నారు. ఈసందర్భంగా రచయిత దంపతులను కళామందిరంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమిత అధ్యక్షుడు తులసినాథంనాయుడు, న్యాయవాది నాగిరెడ్డి, ఆచార్య దండాల రాధాక్రిష్ణారెడ్డి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

నేడు విజయవాడకు కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ కార్యాలయ పనుల నిమిత్తం సోమవారం విజయవాడ వెళ్లనున్నారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ విద్యాధరి బాధ్యతలు నిర్వహించనున్నారు. కలెక్టర్ మంగళవారం జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటారు.

అక్రమ మద్యం స్వాధీనం


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

బంగారుపాళెం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రాగిమానుపెంట గ్రామానికి చెందిన ఢిల్లీప్రసాద్ లక్ష్మీపురానికి వెళ్లే బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా ఉండడంతో అతని వద్ద ఉన్న సంచిని పోలీసులు తనిఖీ చేసినట్లు తెలిపారు. సంచిలో 47 (ఆంధ్ర గోల్డ్ ఫైన్ విస్కీ) మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మద్యాన్ని అక్రమంగా తరలించి విక్రయించేందుకు తీసుకు వెళ్తున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఏఎస్ఐ మల్లెమ్మ, హెడ్ కానిస్టేబుల్ బాబు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ సమావేశం

వి.కోట: ఉపాధి హామీ కింద 2023–24 సంవత్సరంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమ వారం ఉదయం 10 గంటలకు స్థానిక స్త్రీశక్తి భవనంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, పీఆర్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది తప్పక హాజరుకావాలని ప్రకటనలో కోరారు.

పచ్చదనం చాటున ప్రమాదం


ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పచ్చటి తీగలు

ఐరాల: మండలంలోని గోవిందరెడిపల్లె సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు, విద్యుత్ స్తంభానికి పచ్చటి చెట్ల తీగలు అల్లుకున్నాయి. వర్షాకాలం కావడంతో పచ్చటి తీగలకు విద్యుత్ సరఫరా అయితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ మార్గంలో వాహనదారులు, పాదచారులు, ప్రైవేటు స్కూల్ వ్యాన్‌లు, విద్యార్థులు వెళ్తుంటారు. ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

తవణంపల్లె: మండలంలోని సిద్ధంపల్లె రోడ్డు దగ్గర చిత్తూరు– అరగొండ ప్రధాన రహదారి పక్కన ఉన్న 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తీగలు అల్లుకున్నాయి. కరెంటు వైర్లకు తీగలు అల్లుకోవడంతో విద్యుత్ ప్రమాదం జరగడంతోపాటు ఫ్యూజ్ క్యారియర్లు, మోటార్లు, స్టార్టర్లు కాలిపోయే ప్రమాదం ఉంది. మండలంలో విద్యుత్ శాఖ అధికారులు ప్రతి నెలా రెండో శనివారం విధిగా కరెంటు తీగలపై ఉన్న కొమ్మలు, చెట్లు, తీగలను తొలగిస్తారు. అయితే చెట్లు, కంచెల మధ్యలోని ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలను తొలగించడం లేదు. దీనిపై పైపల్లె ఏడీఈ అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా పైపల్లె సబ్‌డివిజనల్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లకు అల్లుకున్న తీగలను పరిశీలించి తొలగిస్తామని వివరించారు. తీగలతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

చురుగ్గా 220 కేవీ సబ్‌స్టేషన్ పనులు


చదళ్ల వద్ద సాగుతున్న సబ్‌స్టేషన్ పనులు

- రూ.120 కోట్లతో సబ్‌స్టేషన్లు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాణ్యమైన విద్యుత్

పుంగనూరు: కర్ణాటక సరిహద్దులో పుంగనూరు ఉండడంతో నాణ్యమైన విద్యుత్ లేక ప్రజలు అవస్థలు పడ్డారు. ముఖ్యంగా రైతాంగం అర్ధరాత్రి కరెంటు కోసం కాపుకాయడం, ప్రమాదాలకు గురికావడం, తరచూ జరిగేది. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి పుంగనూరు నియోజవర్గంలో 29 సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపట్టారు. అలాగే పుంగనూరులో ఈఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి డివిజన్ కార్యాలయం చేశారు. ఇందుకుగాను రూ.200 కోట్లతో సబ్‌స్టేషన్లు, భవన నిర్మాణాలు చేపట్టారు. చదళ్ల గ్రామంలో 220 కేవీ సబ్‌స్టేషన్‌ను రూ.100 కోట్లతో నిర్మిస్తున్నారు. అలాగే చంద్రమాకులపల్లి, పత్రపల్లి, ఆరడిగుంట, మేలుందొడ్డి గ్రామాల్లో రూ.2.50 కోట్లతో ఐదు సబ్‌స్టేషన్లు నిర్మించారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల ఫ్యాక్టరీని రూ.2 కోట్లతో నిర్మించారు. ఇటుకనెల్లూరు, మాగాండ్లపల్లిలో సబ్‌స్టేషన్లు నిర్మించాల్సి ఉంది. అలాగే చౌడేపల్లెలో 5, సదుంలో 4, సోమలలో 4, పులిచెర్లలో 5, రొంపిచెర్లలో 4 సబ్‌స్టేషన్లు నిర్మించారు. వీటితోపాటు విస్తరణ ప్రాంతాల్లో విద్యుత్ లేన్లు ఏర్పాటు చేశారు. ప్రమాదాలకు గురయ్యే విద్యుత్ స్తంభాలు మార్చి కొత్త లేన్లు ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎదురవుతున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందింది. ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసమూర్తి, డీఈఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 220 కేవీ సబ్‌స్టేషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. డీఈఈ మాట్లాడుతూ మూడు నెలల్లో పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన ఈసందర్భంగా తెలిపారు.

గడువు దాటితే ముప్పే

- వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి
- వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి


గ్యాస్ సిలిండర్‌లు

ఐరాల: గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండర్‌కు కాల పరిమితి ఉంటుందని, దానిని గమనిస్తూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీక్ అయ్యే ప్రమాదం ఉంది. వంట గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతీ సిలిండర్‌పై గడువు తేదీ, కోడ్ విధానంలో మెటల్ ప్లేటుపై ముద్రిస్తాయి. సిలిండర్‌ను మార్చుకున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకుని వినియోగించాలి.

ఇలా గుర్తించాలి..

సిలిండర్ మెటల్ ప్లేటుపై ఏ–24, బీ–24 అని ఉంటే ఆ సిలిండర్ 2024 మార్చి–జూన్‌కి గడువు ముగుస్తుందని అర్థం. 24 అంటే 2024వ సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక ఏ అక్షరం జనవరి నుంచి మార్చి వరకు, బీ అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, సీ అక్షరం జులై నుంచి సెప్టెంబర్ వరకు, డీ అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు అని గుర్తించాల్సి ఉంటుంది. సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేటుపై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని గమనించాలి. గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దానిని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాలవారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకునే హక్కు వినియోగదారుడికి ఉంది.

వినియోగదారుల హక్కులు

గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు హక్కులు ఉన్నాయి. గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట ఆ కనెక్షన్ మార్పు చేసుకోవచ్చు. కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదే రోజు కనెక్షన్ పొందవచ్చు. కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టవ్ కొనుగోలు చేయాలన్న నిబంధన ఏమీ లేదు. గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు సిలిండర్ ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి.

సిలిండర్‌కు పదేళ్ల గడువు

సిలిండర్ తయారైనప్పటి నుంచి 10 ఏళ్ల గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తర్వాతే సిలిండర్ మార్కెట్‌లోకి వస్తుంది.

అలరించిన చిన్నారుల నృత్యప్రదర్శనలు


చర్చిలో ప్రపంచ పిల్లల పండుగలో చిన్నారులు

పుంగనూరు: పట్టణంలోని సీఎస్ఐ హట్టన్ మెమోరియల్ చర్చిలో ఆదివారం ప్రపంచ పిల్లల ఆదివారం పండుగను నిర్వహించారు. పాస్టర్ రాకేష్‌ని మ్రోడ్ ఆధ్వర్యంలో చిన్నారులు వివిధ నృత్యప్రదర్శనలు చేశారు. బైబిల్ చదివి కీర్తనలు ఆలపించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సండే స్కూల్ టీచర్లు ఎస్తేరురాణి, సనులత, హేండ్రిహేమంత్, చర్చి ప్రతినిధులు రవికుమార్, భరత్‌భూషణ్, సురేష్ క్రిష్టోఫర్, చిట్టి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.